సాక్షి నల్లగొండ

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



గోవుల పట్టివేత

గోవులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఆదివారం పిలాయిపల్లి గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. - 8లో



20 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

రాష్ట్రంలో మరో 20 ఏళ్ల పాటు కాంగ్రెస్‌దే అధికారమని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 8లో



భక్తజన కోలాహలం

యాదాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలొచ్చి శ్రీస్వామిని దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

పటిష్ట తనిఖీలు నిర్వహిస్తున్నాం

నల్లగొండ క్రైం : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో జిల్లా వ్యాప్తంగా పటిష్ట తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ చందనాదీప్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాష్ట్ర సరిహద్దు వెంట నిఘా ఉంచామని వాడపల్లి, అడవిదేవులపల్లి టెయిల్‌పాండ్, నాగార్జున సాగర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణా అడ్డుకుంటున్నట్లు వివరించారు. పారామిలిటరీ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన అధికారుల సహాయంతో జిల్లా మొత్తం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.2.70 కోట్లు, రూ.23.10 లక్షల విలువ గల మద్యం, రూ.22 వేల విలువగల గంజాయి, రూ.5.73 కోట్ల విలువగల ఆభరణాలు, రూ.51.62 లక్షల విలువగల ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 9 కోట్ల 17 లక్షల 94 వేలు సీజ్ చేసామని తెలిపారు.

మూసీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో



మూసీ రిజర్వాయర్‌లో నీటి మట్టాన్ని తెలిపే సూచిక

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ఏడాది యాసంగిలో ఆయకట్టులో పంటల సాగుకు నీటి విడుదల నిలిపివేసే నాటిని రిజర్వాయర్‌లో నీటిమట్టం 618 అడుగులకు (గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) తగ్గిపోయింది. అకాల వర్షాలతో గత రెండు రోజుల నుంచి మూసీ ఎగువ, పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీలోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ఆదివారం మూసీకి ఎగువ నుండి 250 క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం ఒక అడుగు పెరిగి 619.20 అడుగులకు చేరుకుంది. మూసీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 0.43 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

గోశాలను సందర్శించిన యాదాద్రి ఈఓ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న గోశాలను ఈఓ భాస్కర్‌రావు ఆదివారం సందర్శించారు. వేసవిలో గోవులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అనంతరం ఆలయ ప్రసాద విక్రయశాలలో పులిహోర ప్రసాదాన్ని పరిశీలించారు. భక్తుల నుంచి ఫిర్యాదులు రాకుండా ప్రసాదం తయారీ చేయాలన్నారు. అలాగే ఆలయ మాఢవీధిలో నిర్వహిస్తున్న దీపారధనలో టెండర్‌దారులు డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశారు. దేవస్థానం నిర్ణయించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డైట్ బిల్లులు విడుదల చేయాలి



సభలో మాట్లాడుతున్న తాళ్ల నాగరాజు

సూర్యాపేట టౌన్: తొమ్మిది నెలలుగా డైట్ బిల్లులు విడుదల చేయకపోతే ప్రభుత్వ హాస్టళ్లు ఎలా నిర్వహిస్తారని, వెంటనే డైట్ బిల్లులు చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ సూర్యాపేట జిల్లా 3వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిల్లుల మంజూరు కేవలం తెల్ల పేపర్లలో చూసుకోవడానికే కనిపిస్తున్నాయని, సంక్షేమ వసతి గృహాల అధికారుల అకౌంట్లలో డబ్బులు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వని కారణంగా సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఏడు వేల కోట్ల రూపాయలకుపైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయన్నారు. ముందుగా ఎస్‌ఎఫ్‌ఐ జెండాను సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు మల్లు నాగార్జునరెడ్డి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వెంకన్న, ఉపేందర్, వినయ్, వినయ్, విష్ణు, జవ్వంత్, సుమన్, మనీషా సాయి, అనిల్ పాల్గొన్నారు.

దొడ్డు ధాన్యమూ మిల్లులకే..

- గతంలో సన్నరకాలే కొనుగోలు చేసిన మిల్లర్లు
- ఇప్పుడు దిగుబడి తగ్గడంతో దొడ్డు రకాల కొనుగోలు
- 21 శాతం తేమ ఉంటే మద్దతు ధరపై రూ.100 తగ్గించి కొనుగోలు
- మిల్లర్లకు అమ్ముకునేందుకే రైతుల మొగ్గు
- ప్రభుత్వ కేంద్రాలకు తగ్గిన ధాన్యం రాక

నల్లగొండ : దొడ్డు రకం ధాన్యం కూడా ఈ సారి మిల్లులకే నేరుగా చేరుతోంది. గతంలో మిల్లరు సన్న ధాన్యాన్నే కొనుగోలు చేసేవారు. కానీ ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా సేద్యం తగ్గడంతో.. మిల్లర్లు ముందగానే మేల్కొని మళ్లీ సీజన్‌లో ధాన్యం వచ్చే వరకు మిల్లులు నడిపేందుకు దొడ్డు ధాన్యం వైపు మళ్లారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపై రూ.100 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అయితే 17 శాతం తేమ ఉండాలి.. కానీ మిల్లర్లు 21 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేస్తుండడంతో రైతులు మిల్లర్లకు అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో కేంద్రాలకు ధాన్యం రాక తగ్గింది.



మిల్లర్లకు దొడ్డు ధాన్యమే దిక్కు..

ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేకపోవడంతో సాగర్ ఎడమకాల్వ, ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేదు. కేవలం బోరు బావుల కిందే వరి సాగు చేశారు. భూగర్భ జలాలు కూడా 18 మీటర్లకు పడిపోవడంతో బోర్లు వట్టిపోయాయి. దీంతో సాగు చేసిన పొలాలు నీరందక ఎండిపోయాయి. దిగుబడి చాలా వరకు తగ్గింది. గతంలో దిగుబడి అధికంగా ఉన్నప్పుడు దొడ్డు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మర ఆడించేందుకు మిల్లర్లకు ఇచ్చేది. వచ్చే బియ్యం ప్రభుత్వ అవసరాలు పోను మిగిలినవి ఎఫ్‌సీఐకి ఇచ్చేంది. ఇప్పుడు దిగుబడి తగ్గడంతో మిల్లర్లకు సన్నరకం ధాన్యం తక్కువైంది. ఈ పరిస్థితుల్లో వారు దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

ఇబ్బందులు ఉండవని..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అయితే ధాన్యం 17 తేమ శాతం వచ్చే వరకు ధాన్యం ఆరబెట్టాలి. ధాన్యం తూకం వేసిన తర్వాత మిల్లులకు చేరేంత వరకు రైతులదే బాధ్యత. నాణ్యతా ప్రమాణాలు అన్నీ ఉంటేనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తారు. లేదంటే.. మిల్లర్లు తాలు, తేమ పేరుతో కొర్రీలు పెట్టి తరుగు తీస్తారు. ఇప్పుడు అలాంటిది ఏమీ లేకుండా పచ్చి ధాన్యాన్ని మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తుండడంతో రైతులు కూడా ఆ వైపే మొగ్గు చూపుతున్నారు.

తప్పిన అధికారుల అంచనా

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో సన్నాలు మిల్లర్లే కొనుగోలు చేస్తున్నందున దొడ్డు ధాన్యం 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మార్కెట్‌కు వస్తుందని పేర్కొంది. ఇందుకోసం 370 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే ముందుగానే నల్లగొండ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు 8,900 మంది రైతుల నుంచి 65,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కానీ ఈ సారి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నర్సింహారెడ్డి



తెరిపిలేని వాన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

రామగిరి (నల్లగొండ) : తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తి ఏనుగు నరసింహారెడ్డి అని, ఆయన ప్రజాపక్షం వహించే కవిత్వం రాస్తున్నారని ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాలలో పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ×నరసింహారెడ్డి సాహిత్యంపై ఒకరోజు సాహిత్య సమాలోచన€ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి, ఎం.పురుషోత్తమచార్యులు మాట్లాడుతూ నరసింహారెడ్డి కవిత్వం సమున్నతమైనదన్నారు. మునాసు వెంకట్, తుల శ్రీనివాస్ మాట్లాడుతూ నరసింహారెడ్డి సాహిత్య సేవలను కొనియాడారు.అనంతరం నరసింహారెడ్డి కవిత్వంపై వ్యాసాల సంపుటి 'తెరిపిలేని వాన' గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పోరెడ్డి రంగయ్య, ఆచార్య ఎస్.రఘు, ఎలికట్టె శంకర్‌రావు, గుడిపాటి, తండు కృష్ణకౌండిన్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, చింతోజు మల్లికార్జునాచారి, మాదగాని శంకరయ్య, బక్క పిచ్చయ్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ మండలస్వామి, డాక్టర్ ఉప్పల పద్మ, కనకటి రామకృష్ణ, పొట్టబత్తుల రామకృష్ణ, మహమ్మద్ హసేనా, బరిగెల శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతును వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహా నివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్యాపింగ్‌పై ప్రభుత్వానివి అసత్య ఆరోపణలు



బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ: గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు టీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందన్నారు. బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు మాని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైస్ మిల్లు నుంచి రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు బెదిరించి వసూలు చేసి ఢిల్లీకి పంపిస్తోందని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గత ప్రభుత్వంపై, కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రంగులు వేసిందే తప్పా తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీరు 505 అడుగుల డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికీ వరి సాగుకు నీరు అందించి ఆదుకుందని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని.. ఇప్పుడు వాటిని తుంగలో తొక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్‌ను, మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించే పనిలో ఉన్నారే తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆయా మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

19న సీపీఎం అభ్యర్థి నామినేషన్



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చౌటుప్పల్ : సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలేని కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని రంగారెడ్డి స్మారక భవనంలో ఆదివారం జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతర పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండాలన్నారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉన్న సమయంలో పేదలకు ఉపయోగపడే ఎన్నో చట్టాలను తయారు చేశారని గుర్తుచేశారు. డబ్బు సంచులతో వచ్చే పార్టీలను తరిమికొట్టాలన్నారు. సమావేశంలో నాయకులు పైళ్ల ఆశయ్య, దోనూరి నర్సిరెడ్డి, బూర్గు కృష్ణారెడ్డి, గంగదేవి సైదులు, కిష్టయ్య, సంజీవరెడ్డి, మోహన్, మధుకృష్ణ, వెంకటేశం, బాలయ్య, శ్రీశైలం, అంజయ్య, జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

వైభవంగా నారసింహ హోమం




శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు.

'డబుల్' పరేషాన్..!

నీలగిరి మున్సిపాలిటీలో కొన్ని బహుళ అంతస్తుల భవనాలకు రెండేసి నంబర్లు



- పన్ను చెల్లింపు విషయంలో యజమానుల కిరికిరి
- మాది ఒకటే నంబర్ అంటూ దాటవేత
- మున్సిపల్ సిబ్బందికి తప్పని అవస్థలు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీలోని బహుళ అంతస్తుల భవనాలకు రెండేసి నంబర్లు తీసుకున్న యజమానులు వాటికి ఆస్తి పన్ను చెల్లింపుల విషయంలో కిరికిరి పెడుతున్నారు. నాలుగైదు అంతస్తుల భవనాలు నిర్మించుకున్న వారు.. అప్పటి అవసరాల రిత్యా కొందరు ఒకటి కన్నా ఎక్కువ నంబర్లు తీసుకున్నారు. మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించాలని సదరు భవనాల వద్దకు సిబ్బంది వెళ్లినప్పుడు పన్ను చెల్లించకుండా మొండికేసి సవాలక్ష ప్రశ్నలు వేస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది వాపోతున్నారు. తాము తీసుకుంది ఒకటే నంబర్ అని, మిగతా నంబర్ తమది కాదంటూ ఆస్తి పన్ను చెల్లించకుండా ఎగమానం పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటి నంబర్లు ఇచ్చినప్పుడు ఉన్న ఉద్యోగి ఆ తరువాత బదిలీపై వెళ్తుండడం, ఇతర ప్రాంతాల నుంచి కొత్త వారు వస్తుండడంతో.. వారు సంబంధిత యాజమానులను గట్టిగా ప్రశ్నించలేకపోతున్నారు. ఇలాంటి వాటిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే వీటిపై ఓ నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక చొరవ తీసుకుంటేనే..

నీలగిరి పట్టణంలో నెలకొన్న ఈ డబుల్ నంబర్ల సమస్యపై రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ ఉన్నతాధికారులు కూడా సమీక్షించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప ఈ సమస్య అంత సులభంగా పరిష్కారమయ్యే సూచనలు కనిపించడంలేదు. పట్టణంలో మొత్తం రీ అసిస్‌మెంట్ చేస్తే తప్ప ఈ సమస్య తీరే అవకాశం లేదు.

భారీగానే డబుల్ నంబర్లు..

నీలగిరి పట్టణంలోని 48 వార్డుల్లో 40 వేలకు పైగా నివాస, వాణిజ్య భవనాలు ఉన్నాయి. నీలగిరి పట్టణంలోని హైదరాబాద్ రోడ్, పానగల్ రోడ్, డీవీకే రోడ్‌లో, బీటీఎస్, రామగిరి తదితర ప్రాంతాల్లో ఎక్కువగా డబుల్ నంబర్లు ఉన్న భవనాలు ఉన్నట్లు మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు. డబుల్ నంబర్లు ఉన్న యజమానులు ఒక అంతస్తుకు ఆస్తి పన్ను చెల్లిస్తూ.. మరో అంతస్తుకు చెల్లించకపోవడంతో మున్సిపాలిటీలో ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. సంబంధిత భవనాలకు ఒక దానికి ఉన్న నెంబర్‌కు, బై నెంబర్ అని ఒక సంఖ్య పెంచి వేసి ఉంటున్నాయి. అదే అడ్రస్, వారివే పేర్లు ఉంటున్నా తమవి కావు అని గట్టిగా చెబుతుండడంతో మున్సిపల్ సిబ్బంది ఏమీ అనలేని పరిస్థితి ఉంది. డబుల్ నంబర్లపై ఆస్తి పన్ను వసూలు విషయంలో మున్సిపల్ సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. డబుల్ ఇంటి నంబర్ల కారణంగా మున్సిపాలిటీ ప్రతి సంవత్సరం రూ.50 లక్షల వరకు ఆదాయం కోల్పోతుందనే చర్చ జరుగుతోంది.

ఇంటింటికీ వెళ్లి విచారిస్తాం

ఆస్తి పన్ను చెల్లించని భవనాల వద్దకు వెళ్లి విచారణ చేస్తాం. ఇంటి నంబర్ ఉన్న చోట ఇల్లు ఉందా లేదా, లేక డబుల్ నంబర్లు ఉన్నాయా అనేది ఏప్రిల్ తరువాత క్షేత్ర స్థాయిలోకి వెళ్లి విచారణ చేపడుతాం. ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటాం.

– అరిఫొద్దీన్, మున్సిపల్ ఆర్వో

నందికొండ వాసుల నీటిగోస

- మూడు రోజులుగా నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- తాగునీటికీ తప్పని తిప్పలు
- పట్టింపులేని ప్రాజెక్టు అధికారులు



పంపు మరమ్మతు చేస్తున్న సిబ్బంది



ట్యాంకర్ వద్ద నుంచి నీటిని తీసుకెళ్తున్న ప్రజలు

నాగార్జునసాగర్ : లక్షలాది ఎకరాలకు సాగునీరు, ఎన్నో పట్టణాలు, గ్రామాలు, తండాల ప్రజలకు తాగునీరు అందిస్తున్న నాగార్జునసాగర్ (నందికొండ) వాసులు నీటి కోసం గోసపడుతున్నారు. నందికొండ కాలనీల్లో రోజువిడిచి రోజు నీటిని సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం మోటార్లు మరమ్మతుకు గురి కావడంతో మూడు రోజులుగా నీరు లేక ప్రజలు తల్లడిల్లుతున్నారు. మోటర్లు, పంపులు స్టాండింగ్(అదనంగా)లో ఉండేందుకు ఆప్షన్ ఉన్నప్పటికీ నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు పట్టించుకోకపోవడంతో మొటార్లు, పంపులు మరమ్మతుకు గురైనప్పుడల్లా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా 30 ఏళ్లుగా నందికొండ వాసులకు కష్టాలు తప్పడం లేదు. మున్సిపాలిటీగా ఏర్పటయ్యాక కూడా పరిస్థితి మారలేదు.

పైలాన్ కాలనీలో నీటి సరఫరా బంద్

పైలాన్‌కాలనీకి నీటిని సరఫరా చేసేందుకు నీటి శుద్ధి కేంద్రంలో రెండు పంపులు ఏర్పాటు చేశారు. మరో చోటనుంచి ఒక మోటార్ ద్వారా నీరు సరఫరా అవుతుంది. నీటి శుద్ధి కంద్రంలో అదనపు మోటరు లేదు. ఒక్క మోటార్ నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. మరోచోట ఉన్న మోటరు మరమ్మతుకు గురికావడంతో.. పైలాన్ కాలనీకి కూడా మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

పైలాన్‌కాలనీలోని వీధులకు మున్సిపాలిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అత్యధిక జనాభా ఉండే పైలాన్‌కాలనీలో ట్యాంకర్ల ద్వారా నీటి పూర్తిస్థాయిలో అందకపోవడంతో కొందరు ఆటోల్లో డ్రమ్ములు పెట్టుకుని అవసరాల కోసం నీటిని తెచ్చుకుంటున్నారు. ఇక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు నీళ్లు లేకపోవడంతో ప్రాజెక్టు దిగువన ఉన్న వాటర్ ప్లాంట్ వద్దకే వచ్చి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. అధికారులు స్థానికంగా ఉండకపోవడం, నీటి సరఫరాపై ఉన్నతాధికారులకు అవగాహన లేకపోవడంతో నీటి సరఫరాలో నిరంతరం అంతరాయం కలుగుతోందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్టాండింగ్ మోటార్లను పెట్టుకుని వేసవిలో నిత్యం నీరందించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

రూ.20 కోట్లతో పంప్‌హౌస్ నిర్మాణం

సాగర్ వాసులు నీటి అవసరాలు తీర్చేందుకు ప్రాజెక్టు ఆధునికీకరణ సమయంలో మంజూరయిన నిధుల్లో కాలనీలకు నీటిని పంప్ చేసేందుకు ప్రాజెక్టు దిగువన సుమారు రూ.20 కోట్లతో పంప్ హౌస్ నిర్మించారు. హిల్‌కాలనీకి మూడు మోటర్లు, పైలాన్‌కాలనీకి రెండు మోటర్లు ఏర్పాటు చేశారు. హిల్‌కాలనీ నుంచి పైలాన్ కాలనీకి పైపులైన్ వేశారు. హిల్‌కాలనీలో రెండు, పైలాన్‌కాలనీలో ఒక ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. కొన్నిచోట్ల పాత ట్యాంకుల ద్వారా నీటిని అందించేలా ఏర్పాట్లు చేశారు. రెండు మోటార్లు 24గంటలు నడిస్తేనే హిల్ కాలనీలోని రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీళ్లు ఎక్కుతాయి. ఒక్క మోటార్ మరమ్మతు గురైనా నీళ్ల ఎక్కవు. అదనపు(స్టాండింగ్)మోటారు లేకపోవడంతో అవే మోటర్లు నడిపిస్తుంటారు. ఒక వేళ అవి మరమ్మతు గురైతే వాటిని బాగు చేసే వరకు నీటి సరఫరా ఉండదు. హిల్‌కాలనీకి నీటిని పంప్ చేసే మోటార్ గత వారం మరమ్మతులకు గురికావడంతో బాగు చేసేంతవరకు నీటి సరఫరాను నిలిపివేశారు.

క్లుప్తంగా

50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

దేవరకొండ: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి వైపు బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దేవరకొండ డీటీసీఎస్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున దేవరకొండ మండలం ఇద్దంపల్లి సమీపంలో బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.

నేలమర్రిలో తొమ్మిది క్వింటాళ్లు..

మునగాల: మండల పరిధిలోని నేలమర్రి గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం తమ్మరబండపాలెం గ్రామానికి చెందిన రాయిపూడి రాంబాబు గ్రామాలల్లో పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.6కు కొనుగోలు చేసి మునగాల మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన గుడిపూడి నాగయ్యకు కిలో రూ.13 చొప్పున విక్రయిస్తుంటాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శనివారం రాత్రి నాగయ్య ఇంటిపై దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు రాంబాబు నుంచి కొనుగోలు చేసిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఓ ఆటోను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంటా గోపాల్‌రెడ్డికి ఘన నివాళి



గోపాల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న గంటా సుధాకర్‌రెడ్డి తదితరులు

గరిడేపల్లి: వ్యవసాయానికి యాంత్రీకరణ జోడించి సమష్టి వ్యవసాయాన్ని అందించిన గొప్ప వ్యవసాయ విప్లవకర్త డాక్టర్ గంటా గోపాల్‌రెడ్డి అని గడ్డిపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ గంటా సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో గంటా గోపాల్‌రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గడ్డిపల్లి గ్రామంలో కేవీకేని స్థాపించి లిఫ్టు ఇరిగేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో కొన్ని వేల ఎకరాలకు సాగునీరు అందించిన గొప్ప వ్యక్తి గంటా గోపాల్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, మాజీ చైర్మన్, డైరెక్టర్స్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత



డీసీఎంలో తరలిస్తున్న పశువులు

భూదాన్‌పోచంపల్లి: అక్రమంగా గోవులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఆదివారం ఉదయం పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, పిలాయిపల్లి మాజీ సర్పంచ్ పడాల సతీష్‌చారి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలోని జంజారా సంతలో అజీం అనే వ్యక్తి గోవులను కొనుగోలు చేసి డీసీఎం వాహనంలో పోచంపల్లి మండలం పిలాయిపల్లి మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున జగత్‌పల్లి, పిలాయిపల్లి గ్రామాల మధ్యన సింగిల్ రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇస్తున్న క్రమంలో డీసీఎం వాహనం రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దిగబడిపోయింది. దీంతో హయత్‌నగర్ నుంచి క్రేన్ తెప్పించి డీసీఎంను కాలువ నుంచి బయటికి తీశారు. అనంతరం డీసీఎం వాహనాన్ని వేగంగా తీసుకెళ్తుండగా గ్రామస్తులకు అనుమానం వచ్చి డీసీఎంను అడ్డగించి ఆపి చూడగా అందులో పశువులు ఉన్నాయి. వెంటనే డీసీఎం వాహనంతో పాటు వాహనానికి పైలట్‌గా కారులో వచ్చిన హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు చెందిన అశ్రఫుద్దీన్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే పశువులు కల్గిన డీసీఎం, డ్రైవర్ బానోత్ అశోక్‌తో పాటు అశ్రఫుద్దీన్ అనే వ్యక్తిని అదుపులోకి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీసీఎంలో ఉన్న 24 ఎద్దులు, 2 ఆవులను జియాగూడలోని సమర్థ కామధేను గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

కఠినంగా శిక్షించాలని వినతి..

కాగా గోవులు పట్టుబడ్డాయని సమాచారంతో బజరంగదళ్, బీజేపీ, గోరక్షా దళ్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. గోవధకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఎస్‌ఐ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ పడాల సతీష్‌చారి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, జిల్లా గోరక్ష ప్రముఖ్ బల్ల దుర్వాసులు, బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, గోరక్షదళ్ ఆలిండియా జనరల్ సెక్రటరీ కోటి శ్రీధర్, బజరంగ్‌దళ్ నాయకులు ఇడెం సాయి, చిట్టిమల్ల ప్రవీణ్, బడుగు శ్రీకాంత్, అనిల్ తదితరులు ఉన్నారు.

అ'పూర్వ' కలయిక



సమ్మేళనంలో ఆనాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

- 35 ఏళ్లకు ఒకే వేదికపై కలుసుకున్న మోత్కూర్ జూనియర్ కళాశాల 1987–89 బ్యాచ్ విద్యార్థులు
- ఒకరికొకరు ఆత్మీయ పలకరింపు
- నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్న పూర్వ విద్యార్థులు

మోత్కూరు : హాయ్ ధర్మయ్య హౌఆర్‌యూ.. అజయ్‌కుమార్ ఎలా ఉన్నావ్.. గుడ్‌మార్నింగ్ హన్మంతు బాగున్నావా.. హాలో జమాలుద్దీన్ క్షేమమా.. నమస్కారం సుజాత ఎలా ఉన్నావ్.. జానకి బాగున్నావా.. ఏం చేస్తున్నావ్.. పిల్లలు ఏం చదువుతున్నారు.. అంటూ ఇలా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో చదువుకొని వెళ్లిపోయిన వారంతా 35 ఏళ్లకు ఒకేచోట కలుసుకున్నారు. వారే మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ 1987–89 బ్యాచ్ విద్యార్థులు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో గల ఓ హోటల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాడు కళాశాలలో చదువుకున్నప్పుడు జరిగిన సంఘటనలు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధ్యాపకులతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూలుచల్లుతూ ఆనాటి అధ్యాపకులు కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి, సాయిని శ్రీనివాస్, గనగాని నర్సయ్య, శ్రీధర్, అంజయ్య, భిక్షం, దారం సురేష్, బుర్ర శ్రీనివాస్, యోగానందం, ఎస్ఎన్‌చారి, పూలమ్మ, వీణ, ఉమారాణి, రాధిక, యమున, అరుణ, సీతమ్మ, కరుణ, నూరున్నిసా పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

ఆలేరురూరల్: ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన ఆలేరు మండలంలోని కందిగడ్డ తండా గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందిగడ్డ తండా గ్రామానికి చెందిన మాలోతు కవిత, ఆమె భర్త గోపినాయక్ కలిసి వేసవికాలం కావడంతో శనివారం రాత్రి తమ ఇంటి ఆవరణలో నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గోడ దూకి ఇంటి ఆవరణలోకి వచ్చి కవిత మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును కట్ చేసి తీసుకెళ్లుండగా.. ఆమె మెడకు గాయమైంది. వెంటనే ఆమె తేరుకుని తన భర్తను నిద్రలేపగా.. దొంగను పట్టుకోవడానికి ప్రయత్నించగా అతడు గోడ దూకి పరారయ్యాడు. బాధితురాలి భర్త గోపినాయక్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

నగదు స్వాధీనం

కనగల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఓ వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.4లక్షలు తీసుకెళ్తుండడంతో స్వాధీనం చేసుకున్నట్లు కనగల్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలు.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన అజ్మీరా హుస్సేన్ బొలేరో వాహనంలో ఆదివారం కొండమల్లేపల్లి సంతకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కనగల్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా అతడి వద్ద రూ.4లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

14ఎన్ఎల్‌సీ201– వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, సీఆర్పీఎఫ్ సిబ్బంది

కొండమల్లేపల్లిలో రూ.2.71లక్షలు..

కొండమల్లేపల్లి: వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.2.71లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఇస్లావత్ రవి అనే వ్యక్తి నుంచి రూ.51వేలు, ఉయ్యాల వెంకటేశ్వర్లు నుంచి రూ.1.20లక్షలు, కుంభం శ్రీనివాస్ నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ వెంకటకృష్ణ, రైటర్ వెంకన్న, హోంగార్డ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం..

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని వంకమామిడి గ్రామంలో బొడిగె మహేశ్‌కు చెందిన కిరాణం షాపుపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేసి 48 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

అడ్డగూడూరు: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం అడ్డగూడూరు మండల పరిధిలోని చిన్నపడిశాల గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపడిశాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు పూజారి యాదయ్య(58) రోజుమాదిరిగా ఆదివారం ఉదయం శ్యామలగడ్డ సమీపంలో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గీత కార్మికుడికి గాయాలు..



గాయపడిన బాలయ్య

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో ఆదివారం సాయంత్రం తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్తాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఇటమోని బాలయ్య రోజుమాదిరిగానే గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో బాలయ్య రెండుకాళ్లు విరిగాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



బరిగల రమేష్ (ఫైల్)

రామన్నపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బరిగల రమేష్(45) రోజువారి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పది సంవత్సరాల క్రితమే రమేష్ భార్య చనిపోవడంతో ఇద్దరు పిలలను అతడే పోషిస్తున్నాడు. శనివారం ఉదయం అతడు రామన్నపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్ వద్ద చిట్యాల–భువనగిరి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడికి రామన్నపేట ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. ఆదివారం మృతుడి సోదరుడు భూపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టి..

పాలకవీడు: మండలంలోని గుడుగుంట్లపాలెం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. పాలకవీడు మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన తీగల రమణారెడ్డి(55) స్వగ్రామంలో వ్యవసాయం చేయడంతో పాటు కుటుంబంతో కలిసి నేరేడుచర్లలో నివాసముంటూ ఓ పురుగు మందుల కంపెనీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. రమణారెడ్డి ఆదివారం పని నిమిత్తం బైక్‌పై స్వగ్రామం యల్లాపురం వచ్చి తిరిగి నేరేడుచర్లకు వెళ్తుండగా.. గుడుగుంట్లపాలెం శివారులో మూలమలుపు వద్ద ఎన్ఎస్‌పీ ఆర్–9 కల్వర్టును ఢీకొని కాలువలో పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బైక్ ఢీకొని..

చౌటుప్పల్: మండల పరిధిలోని పంతంగి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంతంగి గ్రామానికి చెందిన నందగిరి యాదయ్య(56), అతడి భార్య నందగిరి యాదమ్మ టీవీఎస్ ఎక్సెల్‌పై పంతంగి టోల్‌ప్లాజా నుంచి పంతంగి గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ యాదయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు నందగిరి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలలో అధికారుల విచారణ

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో మరో ఆరుగురిని ఆదివారం పాఠశాల నుంచి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఆరుగురితో పాటు మరో పది మంది కూడా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా గురుకుల పాఠశాలను యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, ఆర్‌సీఓ రజిని, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థుల యోగక్షేమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. సంఘటన జరిగిన తీరుపై విద్యార్థులతో పాటు అధికారులను విచారించారు. పాఠశాలలోని వంట పాత్రలు, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక అధికారిగా ఆర్డీఓ అమరేందర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే

ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. విద్యార్థులు త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పోత్తంశెట్టి వెంకటేశ్వర్లు, ఈరపాక నర్సింహ, బడిగెల ప్రదీప్ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చెరుకుపల్లి శ్రీకాంత్ రాయినిగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. భర్త చనిపోయిన రెండు రోజులకు శ్రీకాంత్ భార్య ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. పుట్టిన పిల్లలు అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం చిన్నారులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తిప్పర్తి జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తక్షణ సాయంగా రూ.లక్ష ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి పంపించారు. ఆదివారం జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముతినేని శ్యాంసుందర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి రూరల్: ప్రాథమిక విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. జయరాజు అన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ ప్రపంచ మేధావిగా వెలుగొంది భారతదేశానికి అంతులేని కీర్తి చేకూర్చారని అన్నారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె. మారుతీదేవి మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు పోయినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథరామయ్య, భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్‌రావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి. కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, ఉపాధ్యక్షుడు జయ, డీఈఓ నారాయణరెడ్డి, ఎస్‌సీజీఓ జైపాల్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది నాగారం అంజయ్య, కుక్కదూగ కృష్ణ, శివకిరణ్, జైపాల్ పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కనగల్: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కనగల్ మండలం చర్లగౌరారం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం చర్లగౌరారం గ్రామంలోని ఓ బావిలో వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటం గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయగా.. మృతుడు జి. యడవల్లి గ్రామానికి చెందిన తలారి వెంకన్న(45)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కుటుంబ కలహాలతోనే వెంకన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డు మెడల్స్ అందుకుంటున్న తారక్ నంద, ఆకృతి

భువనగిరి: పట్టణంలోని శ్రీ ఆర్‌కే హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ చావా రాజ్‌కుమార్, ఆశ్లేష దంపతుల కుమారుడు తారక్ నంద ఒక్క నిమిషం 42 సెకండ్ల వ్యవధిలో 100 దేశాల రాజధానుల పేర్లు చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నాడు. ఈ నెల 13న ఢిల్లీలోని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో దేశంలో అత్యంత వేగంగా తక్కువ సమయంలో దేశాల రాజధానుల పేర్లు చెప్పినందుకు రికార్డులో పేరు దక్కించుకున్నాడు. అలాగే అతని సోదరి చావా ఆకృతి 4 నిమిషాల 50 సెకండ్లలో 195 దేశాల రాజధానుల పేర్లు చెప్పినందుకుగాను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అప్రిసియేషన్‌ను దక్కించుకుంది. తారక్ నంద ఎల్‌కేజీ, ఆకృతి 3వ తరగతి చదువుతున్నారు. వీరిని పలువురు అభినందించారు.

యాదాద్రి క్షేత్రంలో భక్తజన కోలాహలం



భక్తులతో నిండిపోయిన నిత్య కల్యాణ మండపం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులతో పాటు ఆదివారం వారాంతపు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. స్వామివారి ధర్మ దర్శనానికి నాలుగు గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. క్యూకాంప్లెక్స్, ముఖ మండపం క్యూలైన్, మాడ వీధులు, నిత్య కల్యాణ మండపం, శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కొండ పైన, కొండ కింద బస్టాండ్ ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. నిత్యాదాయం రూ.61,77,746 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

రామాయణ పారాయణం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో నిర్వహిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రామాయణ పారాయణం నిర్వహించారు. అంతకుముందు శివాలయంలో నిత్యారాధనలు నిర్వహించిన పూజారులు మూలమంత్ర జపములు, దశ శాంతి పంచసూక్త పారాయణం చేపట్టారు. సాయంత్రం సహస్రనామార్చనలు, నివేదన, నీరాజనం జరిపించారు. ఆయా వేడుకల్లో వేద పండితులు, అర్చకులు, పారాయణీకులు పాల్గొన్నారు.

పూర్వగిరి ఆలయంలో విరాటపర్వం సినిమా దర్శకుడు..

యాదాద్రి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని విరాటపర్వం సినిమా దర్శకుడు ఊడుగుల వేణు ఆదివారం దర్శించుకున్నారు.

20 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు

తిరుమలగిరి(తుంగతుర్తి): తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, రాష్ట్రంలో మరో 20 ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమలగిరిలో తుంగతుర్తి నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పులపాలైందని ఆరోపించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరి దీవెనలతో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో 11 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని అన్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వంద కోట్లు ఖర్చు చేసి గెలిచాడని విమర్శించారు. జగదీష్‌రెడ్డి గడిచిన పదేళ్లలో వేల కోట్లు సంపాదించాడని ఆరోపించారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా ఎప్పుడైతే మార్చారో అప్పుడే ఆ పార్టీకి తెలంగాణతో పేగు బంధం తెగిపోయిందన్నారు. కాంగ్రెస్ తలుచుకుంటే బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందన్నారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ముగ్గురే మిగులుతారని తెలిపారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ నెల 21న భువనగిరిలో కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని, ఈ కార్యక్రమానికి తుంగతుర్తి నియోజకవర్గం నుంచి 50వేల మంది తరలిరావాలని కోరారు.

చామల గెలుపు ఖాయం: ఆర్. దామోదర్‌రెడ్డి

భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపైనే ఉందన్నారు.

లక్ష మెజార్టీ వస్తుంది: ఎమ్మెల్యే సామేల్

శాసనసభ ఎన్నికల్లో తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీకి 52వేల మెజార్టీ వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఈ నియోజకవర్గంలో లక్ష మెజార్టీ వస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. కార్యకర్తలంతా కష్టపడి పనిచేసి భారీ మెజార్టీ తేవాలన్నారు.

రాజ్యాంగం మారుస్తారు: చామల

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మారుస్తారని భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో అన్ని ధరలు పెరగడంతో పేద ప్రజలు బతకలేకపోతున్నారని తెలిపారు. కార్యకర్తలంతా కష్టపడి కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, బాలలక్ష్మి, గుడిపాటి నర్సయ్య, తండు శ్రీనివాస్, జ్ఞానసుందర్, పత్రిపాటి యుగంధర్, ఇటికాల చిరంజీవి, సంకెపల్లి కొండల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శాగంటి అనసూర్య, మండల అధ్యక్షులు వై. నరేష్, యోగానందచారి, పాలకుర్తి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.